క్లుప్తంగా

కార్యకర్తలను కాపాడుకుంటా



ఆత్మకూరు: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యుడు ఎంబటి రాజయ్యతో పాటు పలువురు నాయకులు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరగా హనుమకొండలోని తన నివాసంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతవడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో గతంలో ఎన్నడూలేని అభివృద్ధి జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంధ్యారాణి శనివారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో ఎస్సీ క్యాటగిరీకి 2సీట్లు, ఓసీ 01 చొప్పున మొత్తం 03 సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 28 వ తేదీన ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 10వ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కాగలరని సూచించారు. మెరిట్ ప్రకారం అడ్మిషన్‌లు ఉంటాయని తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు



గాయపడిన యాదగిరిగౌడ్

ఎల్కతుర్తి: మండలంలోని వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన వంగ యాదగిరిగౌడ్ తాటిచెట్టు ఎక్కుతూ ప్రమావశాత్తు మోకు జారీ కింద పడడంతో తీవ్ర గాయాలు అయినట్లు గ్రామస్తులు తెలిపారు. వృత్తిలో భాగంగా రోజుమాదిరిగానే శనివారం కల్లు తీసేందుకు తాడిచెట్టు ఎక్కుతున్నాడు ఈ క్రమంలో మోకు జారీ చెట్టుపై నుంచి కింద పడినట్లు తెలిపారు. దీంతో యాదగిరిగౌడ్‌కు తీవ్ర గాయాలుకాగా 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించనట్లు తెలిపారు.

కమిటీ ఎన్నిక



మండ అశోక్

కమలాపూర్: మండల కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయస్వామి దేవస్థాన నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండ అశోక్, ఉపాధ్యక్షులుగా శనిగరపు జనార్దన్, పుల్ల అయిలయ్య, కాల్వ కుమారస్వామి, జక్కు భిక్షపతి, వెంగళ సహదేవ్, కొయ్యడ సునీల్, ప్రధాన కార్యదర్శిగా జడల నర్సింహస్వామి, సహాయ కార్యదర్శులుగా మౌటం తిరుపతి, వెంగళ శ్రీనివాస్, కొడారి అరుణ్, కీత రాజేష్, శనిగరపు శ్రీనివాస్, మచ్చేందర్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా స్థానిక సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ మౌటం రమేష్, సభ్యులుగా గొట్టె శ్రీను, మండ కుమార్, బైరి రాజేష్, గొట్టె మహేందర్, శనిగరపు భిక్షపతి, పెరుమాండ్ల మొగిలి, మహేందర్, విజయ్, జయపాల్‌రెడ్డి, వెంకన్న, దామోదర్ ఎన్నికయ్యారు.

వైభవంగా ప్రతిష్ఠాపన



ఎల్కతుర్తి: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో పోచమ్మ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం రెండోరోజు కొనసాగినట్లు గ్రామ సర్పంచ్ అంబాల మమతప్రతాప్ తెలిపారు. స్థాపిత మంటప దేవతల పూజలు, నవగ్రహ రుద్రమూల మంత్రస్వాహక హోమం, విగ్రహ యంత్రరాధన, ఉపచారములు, విగ్రహ మూర్తుల ధాన్యాదివాసము, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, సర్వత్ భద్రమండలి దేవతస్థాపనం, అర్చన హోమం, విగ్రహ ఫలాదివాసం, పుష్పాదివాసం, వనాదివాసం, శయనాదివాసం, పవలింపు సేవ, మంగళహారతి మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దామెర: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఊరుగొండ మీ సేవ నిర్వాహకుడు జన్ను విజయ్ కోరారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ తహసీల్దార్ ఖురేషీకి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మీసేవ నిర్వాహకులకు కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వశాఖలకు సంబంధించిన వివిధ సేవలు మీ సేవల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. మీ సేవ కేంద్రాలకు ఉచిత విద్యుత్ అందించాలని ఆయన కోరారు.

మొక్కల పెంపకం ఉద్యమంలా చేపట్టాలి

- ప్రారంభమైన 'కోటి వృక్షార్చన'
- మొక్కలు నాటిన అడిషనల్ కలెక్టర్
- గ్రామాల్లో పండుగ వాతావరణం



ధర్మసాగర్‌లో చేపట్టిన కోటి వృక్షార్చనలో మొక్క నాటుతున్న అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ



ఎల్కతుర్తిలో..



కమలాపూర్‌లో..



దామెరలో..



కమలాపూర్ : ఇండియా, తెలంగాణ ఆకృతుల్లో విద్యార్థినులు

ధర్మసాగర్: మొక్కల పెంపకం ఉద్యమంలా చేపడితేనే రాష్ట్రంలో గ్రీన్ కవరేజ్, అటవీ శాతం గణనీయంగా పెరుగుతుందని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ సీహెచ్ మహేందర్ జీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో శనివారం ఏర్పాటు చేసిన హరితహారం, ఈశా ఫౌండేషన్ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పు అరికట్టినప్పుడే రుతువులు సవ్యంగా కొనసాగి సుస్థిర సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అర్బన్ ప్రాంతం అధికంగా ఉన్న హనుమకొండ జిల్లాలో ధర్మసాగర్ మండలం కీలకమని, ఇక్కడి హరిత సంపద, వనాల పెంపకం వలన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధితో పాటు ఉపాధి కల్పన పెరుగుతుందన్నారు. అనంతరం ఈశా ఫౌండేషన్ గ్రామోత్సవ్ క్రీడలను ప్రారంభించారు. గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు గ్రామోత్సవ్ పేరుతో టోర్నమెంట్ నిర్వహిస్తున్న సద్గురు ఈశా ఫౌండేషన్ సేవలు గొప్పవని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, ఫౌండేషన్ నిర్వహణ బాధ్యుడు వేణుగోపాల్, జిల్లా ఇంటర్ విద్యాధికారి గోపాల్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత కోటి వృక్షోత్సవంలో భాగంగా మండలంలోని గుండ్లసాగర్, మల్లికుదుర్ల గ్రామాల్లో మొక్కలు నాటారు. వారి వెంట ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కోమి, ఏపీఓ విజయ, సర్పంచ్ గోదల రాజిరెడ్డి, ఎంపీటీసీ బాల్నె వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ వంగ ఎల్లయ్య, పాఠశాల హెచ్ఎం దుర్గాభవాని, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి: మొక్కలతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో శనివారం డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన అవి వృక్షాలుగా ఎదిగి భవిష్యత్తు తరాలకు దోహద పడుతాయన్నారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకోవాలని సూచించారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు చెట్లు ముఖ్యమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కోటి వృక్షార్చనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, ఎంపీడీఓలు తూర్పాటి సునీత, భాస్కర్, ఏపీఎంలు రవీందర్, దేవానంద్, ఏఓలు రాజ్‌కుమార్, అబ్జల్‌పాషా, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, నాయకులు గొడిశాల సమ్మయ్యగౌడ్, వినయ్‌గౌడ్, అల్లకొండ రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కోటి మొక్కలు నాటే కార్యక్రమం శనివారం మండల వ్యాప్తంగా పండుగలా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి డీపీఓ జగదీశ్వర్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని సూచించారు. మండలంలోని గుండేడులో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం ఆవరణంలో ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ కల్యాణి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులకు వాయినాలు అందించి వారితో కలిసి మొక్కలు నాటారు. మండల వ్యాప్తంగా ఒకేరోజు 19,350 మొక్కలు నాటించినట్లు ఎంపీడీఓ పల్లవి వెల్లడించారు. ఎంజేపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 500 మంది విద్యార్థినులు ఇండియా, తెలంగాణ ఆకృతుల్లో ఏర్పడగా, 30 మీటర్ల జాతీయ జెండా పట్టుకుని, ఒకటి నుంచి పది అంకెలు వచ్చే విధంగా విద్యార్థినుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సర్పంచ్‌లు సాంబయ్య, లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ లక్ష్మి, ఇన్‌స్పెక్టర్ సంజీవ్, ఎంపీఓ విమల, ఈజీఎస్ ఏపీఓ రమేష్, ప్రిన్సిపాల్ ప్రఫుల్లాదేవి, పీఈటీ సంగీత, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

దామెర: పర్యావరణ పరిక్షణకు మొక్కలే ఆధారమని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. కోటి మొక్కల వృక్షార్చన (హరిహారం) కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. అడవులను నరకడం మూలంగా గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం ఏర్పడి వాతావరణ సమతుల్యత కోల్పోయిందన్నారు. మానవ మనుగడ సాధించాలంటే మొక్కలు విరివిగా నాటాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కనూ చంటిబిడ్డలా కాపాడాలన్నారు. జెడ్పీటీసీ గరిగె కల్పనక్రిష్ణమూర్తి, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, మండల ప్రత్యేక అధికారి మాధవిలత, ఎంపీడీఓ రవీందర్, ఎంపీటీసీలు పోలం కృపాకర్‌రెడ్డి, గండు రాము, ఎంపీఓ నాగరాజు, ఏపీఎం ఝాన్సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, రాణి, ఏపీఓ శారద, కోఆప్షన్ సభ్యుడు హింగె బాబురావు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఐనవోలు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కోటి వృక్షార్చన కార్యక్రమంలో మండల వ్యాప్తంగా శనివారం 14750 మొక్కలు నాటినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఐనవోలు, పున్నేలు గ్రామాల్లో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ప్రతి జీపీ పరిధిలో 750 మొక్కలు చొప్పున నాటగా, పున్నేలు జీపీ పరిధిలో 2750 మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఏపీఓ నక్క కుమారస్వామి, సర్పంచ్‌లు జన్ను కుమారస్వామి, కత్తి దేవేందర్, ఎంపీటీసీలు కొత్తూరి కల్పన, చాట్ల అరుణ, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి పంటను రక్షించుకోవాలి



పత్తిచేనును పరిశీలిస్తున్న మారి సంస్థ ప్రతినిధులు

శాయంపేట : పత్తి పంటలో పురుగుల ఉధృతిని గమనించి వాటి నివారణ చర్యలు తీసుకుని పంటను రక్షించుకోవాలని పీయూ మేనేజర్ అక్కల రమేష్ అన్నారు. మండలంలోని కొత్తగట్టు సింగారంలో ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్, మారి స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్గత స్వీయ పరిశీలన కార్యక్రమం శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చే పురుగు అధికంగా ఉందని, మిత్ర పురుగుల వృద్ధిని పెంపొందించుకొని రసం పీల్చే పురుగులను నివారించవచ్చన్నారు. పురుగుల ఉధృతిని రైతులు గమనించి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మారి సంస్థ మేనేజర్ ప్రియాంక, ఎఫ్‌పీసీఎల్ సలహా మండలి సభ్యుడు కూకిడి నాగేశ్వర్‌రావు, గ్రామ ఆదర్శ రైతు కూకిడి రాజేందర్, సిబ్బంది భానుమతి, కల్పన రాంబాబు, రైతులు శనబందం, రాజేశ్వర్‌రావు, రాఘవరెడ్డి, బుచ్చిరెడ్డి, శివాజీ, రామయ్య, రాజేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

29, 30న క్రీడాకారుల ఎంపిక

ఐనవోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో ఉత్తమ మండల టీం ఎంపికను ఈ నెల 29, 30 వ తేదీల్లో చేపట్టనున్నట్లు ఎంఈఓ వెంకటేశ్వర్ రావు శనివారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు స్కూల్ స్టడీ సర్టిఫికేట్, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు. 8వ తరగతిలోపు విద్యార్థులు అండర్ 14 విభాగంలో, 9,10 వ తరగతి విద్యార్థులు అండర్ 17 విభాగంలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ నెల 29వ తేదీన బాలుర ఎంపికలు, 30 వ తేదీన బాలికల ఎంపికలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి క్రీడా విభాగంలో ప్రతిభ కనబరిచే 10 మందిని ఎంపిక చేసి మండల టీంగా జిల్లా స్థాయిలో సెప్టెంబర్‌లో జరిగే పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు.

నేడు నృత్య స్రవంతి వార్షికోత్సవం

హన్మకొండ కల్చరల్: రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నృత్య స్రవంతి కూచిపూడి నృత్య కళాక్షేత్రం 31వ వార్షికోత్సవాన్ని హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం నిర్వాహకురాలు, నృత్య గురువు తాడూరి రేణుక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

'కల్వకుంట్ల కుటుంబమే బంగారమైంది'



ఆత్మకూరు: మాట్లాడుతున్న హుబ్లీ బీజేపీ ఎమ్మెల్యే అరవింద్ బెల్లద

పరకాల: బంగారు తెలంగాణ అని ప్రజలను మభ్య పెడుతూ సీఎం కేసీఆర్ తన కుటుంబాన్ని బంగారం చేసుకున్నారని హుబ్లీ ధార్వాడ్ హుబ్లీ వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే అరవింద్ బెల్లద ఆరోపించారు. పట్టణంలోని లక్ష్మీసాయి కన్వెన్షన్‌హాల్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం, బంగారు తెలంగాణ అనే పేర్లు విన్నానని, తెలంగాణకు వచ్చి ప్రజలను అడిగితే రాష్ట్రం బంగారు తెలంగాణ కాలేదని, కల్వకుంట్ల కుటుంబమే బంగారమైందని చెప్తున్నారని విర్శించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడంతో ఆ పార్టీని ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. భారతదేశాన్ని పరిపాలించే బీజేపీని, నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు పట్టణంలో చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సతీష్‌కుమార్, నాయకులు మార్త భిక్షపతి, గుజ్జుల సత్యనారాయణరావు, డాక్టర్ మురళీధర్‌గౌడ్, జయంత్‌రావు, మేఘనాథ్, జితేందర్ రెడ్డి, గురుప్రసాద్, కౌన్సిలర్లు భద్రయ్య, పూర్ణాచారి ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని హుబ్లీ దార్వాడ్ వెస్ట్ ఎమ్మెల్యే అరవింద్ బెల్లద కోరారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జ సత్యనారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్‌మోర్చా కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి బయ్య పైడి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఐనవోలు : ప్రత్యేక క్యాంపెయిన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



దామెర: బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్



శాయంపేట : అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

ఐనవోలు: 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని వర్ధన్నపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే సూచించారు. మండలంలోని పంథినిలో 180, 181, 182, 183 పోలింగ్ స్టేషన్‌లల్లో కొనసాగుతున్న స్పెషల్ క్యాంపును శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫామ్ 6 ద్వారా ఓటరు నమోదు, ఫామ్ 8 ద్వారా ఓటరు సవరణలు చేసుకోవచ్చని అన్నారు. ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారు స్థానిక బీఎల్‌ఓను, ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్, మొబైల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేలా బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలని సూచించారు.

దామెర: మండలంలోని 18 ఏళ్లు నిండిన యువతి, యువకులను ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి సూచించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు 2023 అక్టోబర్ 1 వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. నూతన ఓటరు నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 2, 3 వ తేదీల్లో కూడా స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. నమోదు, సవరణలకు సంబంధించి బీఎల్‌ఓలకు సలహాలు, సూచనలు చేశారు. ప్రతీ గ్రామంలో అర్హులైన వారిని గుర్తించాలన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పద్మావతి, జంగం రాణి, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

శాయంపేట : మండలంలోని 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటురుగా నమోదు చేసుకుని ఓటుహక్కు పొందాలని తహసీల్దార్ సుభాషిణి అన్నారు. వివిధ గ్రామాల్లో గల పోలింగ్ స్టేషన్‌లల్లో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదు కోసం నేడు, రేపు, సెప్టెంబర్ 2, 3 వ తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

త్రో బాల్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



నగదు బహుమతి అందజేస్తున్న సభ్యులు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థులు శనివారం జరిగిన జిల్లా స్థాయి త్రో బాల్ బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను హనుమకొండ జిల్లా డిప్యూటీ కలెక్టర్ మహేందర్‌జీ ప్రారంభించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు త్రో బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి ఫౌండేషన్ సభ్యులు శిరీష, వేణుగోపాల్ ప్రశంస పత్రాలతో పాటు రూ. 5వేల నగదు పురస్కారాన్ని అందించారు. సిద్దిపేటలో సెప్టెంబర్ నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కరిత, టీం కోచ్ శ్రీధర్ తెలిపారు. ప్రథమ బహుమతి అందుకున్న విద్యార్థులను ఎంఈఓ రమాదేవి, పీఈటీతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, సర్పంచ్ అభినందించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న పీఠాధిపతి బాలశంకర్‌శాస్త్రీ

ఆత్మకూరు: మండలంలోని కామారంలో శ్రీశివశక్తి క్షేత్ర దేవస్థాన నిర్మాణానికి శనివారం భూమిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీశైలమల్లికార్జునస్వామి పీఠాధిపతి బాలశంకర్‌శాస్త్రీ, గణేష్ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల ఆర్థిక చేయూత

కాశిబుగ్గ: బాసర ఐఐటీలో సీటు సాధించిన కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి)కు చెందిన బుడిమే అక్షిత తల్లిదండ్రులకు వీఏకే ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. గుడిబడిలో శనివారం జరిగిన కార్యక్రమంలో రూ.20 వేల విలువగల చెక్కును విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీవిద్య – చంద్రమౌళిలకు యూపీ బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ అగర్వాల్, బీజేపీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ చేతుల మీదుగా ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. హెచ్ఎం కుంట రవికుమార్, బీజేపీ నాయకులు సముద్రాల పరమేశ్వర్, ఆడెపు వెంకటేష్, సుతారి గోపి, కనుకుంట్ల రంజిత్, పిట్టల కిరణ్, రజనీష్, గోవింద్ సింగ్ పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థికి సాయం

కేయూ క్యాంపస్: మెడిసిన్‌లో సీటు సాధించిన నిరుపేద విద్యార్థి సంద్రు కమల్‌కు కాకతీయ యూనివర్సిటీలోని పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ మనోహర్ ఆధ్వర్యంలో మహా ఆదిసేవా సమితి తరఫున రూ.15 వేలను యూనివర్సిటీలో శనివారం అందించారు.

ఎల్బీ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

రామన్నపేట: వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాలలో తెలంగాణ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో 2023 -24వ సంవత్సరానికి ఎన్‌సీసీకి 81 నూతన కేడెట్ల ఎంపిక ప్రక్రియను చేపట్టినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. ఆర్మీ నిబంధనల ప్రకారం విద్యార్థుల ప్రతిభ, భౌతిక, రాత పరీక్షల ఆధారంగా కేడెట్ల మెరిట్ లిస్టును ప్రకటించనున్నట్లు చెప్పారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ పాల్గొన్నారు.

అయ్యో.. టమాట!



వ్యాపారులు రోడ్డుపై పడేసిన టమాటాలు

శాయంపేట: జూలై నెలలో టమాట ధరలు ఆకాశ్నంటగా.. ప్రస్తుతం తగ్గుతూ వచ్చింది. హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన తైబజార్‌లో టమాటాలను కిలో 20నుంచి రూ.30వరకే విక్రయించారు. పెద్ద సంఖ్యలో బాక్సుల్లో తెచ్చిన వ్యాపారులు కొనుగోళ్లు లేక కుళ్లిపోయిన వాటిని ఇలా రోడ్డుపై పారేసి వెళ్లిపోయారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎన్. కల్యాన్ (S.R) : 8686236437 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)